క్లుప్తంగా

పురస్కారం అందజేత



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్‌కు మదర్‌థెరిస్సా సేవా పురస్కారం గురువారం అందుకున్నాడు. లయన్స్ క్లబ్ విజయవాడ, అంజలి ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక అకాడమి సేవా సంస్థల ఆధ్వర్యంలో అవార్డులను విజయవాడ ఎమ్మెల్యే మల్లాడి విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు కిషన్ నాయక్ తెలిపారు.

జరిమానా

మహబూబాబాద్: ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించవద్దని దాంతో పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని మున్సిపాలిటీ పర్యావరణ ఇంజినీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీహరి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం మున్సిపాలిటీ సిబ్బంది పలు షాపులను తనిఖీ చేసి, ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న షాపుల యజమానులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెం శివారు సర్వే నంబర్ 298/1 లో 6 ఎకరాల 12గుంటల ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అశోక్‌కుమార్ శుక్రవారం స్థలంలో బోర్డు నాటి తెలిపారు. గతంలో ఇదే భూమి ఓ వ్యక్తి కొంతకాలంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపాడు. ఆ భూమి ప్రభుత్వ భూమిగా కోర్టు తెలిపినట్లు పేర్కొన్నాడు.

సన్నాహక సమావేశం

డోర్నకల్: ఈనెల 13న డోర్నకల్‌లో నిర్వహించనున్న జోనల్ క్రీడలకు సంబంధించి శుక్రవారం డోర్నకల్, కురవి, సీరోలు మండలాల స్థాయి జోనల్‌స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ నిర్వహణకు డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జోనల్ సెక్రెటరీగా డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్ పీడీ శ్యాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జ్యోతి, పీడీలు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

కేసముద్రం: మండలంలోని మహముద్‌పట్నం గ్రామంలో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఎస్‌ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో సందర్శించి, విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సముద్రాల మహేష్, చందు, తరుణ్‌నాయక్, యశ్వంత్ పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతపూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాస శుక్రవారం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు.

మహబూబాబాద్ రూరల్: మహాలక్ష్మి, పార్వతీదేవి, మహాసరస్వతి, వరలక్ష్మి అమ్మవార్లకు జిల్లా కేంద్రంలో వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు.

కుంకుమ పూజలు

తొర్రూరు: పట్టణంలోని కృష్ణ మందిరంలో ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రావణమాస కుంకుమ పూజల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎర్రబెల్లి ఛారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు స్థానికులతో కలిసి కుంకుమ పూజలు చేశారు.

తీజ్ వేడుకలు

గూడూరు: మండలంలోని అప్పరాజ్‌పల్లి శివారు అక్యాతండాలో శుక్రవారం గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ వేడుకలను జరుపుకున్నారు. చివరి రోజు ఆటపాటలతో వెళ్లి తీజ్ బుట్టలను సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

ఐఎఫ్‌టీయూ కమిటీ ఎన్నిక

తొర్రూరు: ఐఎఫ్‌టీయూ నూతన మండల కమిటీని శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాదిల అరుణ్, ఉపాధ్యక్షుడిగా రాయిశెట్టి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ షరీఫ్, సహాయ కార్యదర్శిగా బానోతు బాలు, కోశాధికారిగా సెగ్యం వెంకన్న ఎన్నికయ్యారు.

కళాశాలను ఎంచుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: 2023- 24 విద్యా సంవత్సరానికి బీ-ఫార్మసీ కౌన్సిలింగ్‌లో మానుకోటలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ ఫార్మసీ కళాశాలను విద్యార్థులు ఎంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. వాసంతి శుక్రవారం తెలిపారు. ఈనెల 4నుంచి 7వరకు మొదటి విడత, చివరి విడుతలో భాగంగా 17నుంచి 19 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ... సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: మాధవాపురం జెడ్పీ హైస్కూల్లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో..



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలుర పాఠశాలలో..



గార్ల: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు



డోర్నకల్: నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు



కేసముద్రం: ఇనుగుర్తిలో..



మరిపెడ: వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు



పెద్దవంగర: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీపీయూఎస్ నాయకులు



చిన్నగూడూరు: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ అర్బన్: నిరసన తెలుపుతున్న సీపీఎస్‌ఈయూ నాయకులు



గూడూరు: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బీజేపీ నల్ల చట్టాలను తిప్పికొట్టాలి

కురవి: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ తీసుకొచ్చిన నల్ల చట్టాలను తిప్పికొట్టాలని భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు జైసింగ్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కమిటీ ఆధ్వర్యంలో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సమావేశం సంఘం జిల్లా చైర్మన్ పొట్ల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈనెల 7వ తేదీన కురవిలో కిసాన్ బచావో-భారత్ బచావో నినాదంతో రైతు రణభేరి సభను నిర్వహించడం జరుగుతుందని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎల్‌హెచ్‌పీఎస్, అంబేడ్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు కర్నం రాజన్న, గుగులోత్ బీమానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైసింగ్ రాథోడ్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మరిపెడ రూరల్/పెద్దవంగర/తొర్రూరు: వీఓఏల గౌరవ వేతనాలు రాఖీ కానుకగా రూ.8వేలకు పెంచడంపై వీఓఏలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయా మండలాల్లో శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, హరీశ్‌రావు, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ల చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం మరిపెడ అధ్యక్ష, కార్యదర్శులు రాంపెల్లి వెంకన్న, పెద్దవంగర అధ్యక్షురాలు సంధ్య, తొర్రూరు మండల అధ్యక్షుడు సనికినేని శ్రీనివాస్, వీఓఏలు మౌనిక, కొండూరు వెంకన్న, పద్మ, శోభ, మేనకదేవి, నూకల అనిల్ , ప్రధాన కార్యదర్శి మంజుల, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు: పాలాభిషేకం చేస్తున్న వీఓఏలు

'శాతవాహన'కు హాల్టింగ్ ఇవ్వాలి

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని కోరుతూ శుక్రవారం డోర్నకల్ వచ్చిన సికింద్రాబాద్ రైల్వే డివిజన్ డీఆర్‌ఎం బ్రితేష్‌కుమార్ జైన్‌కు గార్ల మండల అఖిలపక్షం నాయకులు వినతిపత్రం అందజేశారు. తొలుత గార్లలో ఇటీవల మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేసినందులకు గాను ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విమల్‌కుమార్‌జైన్, శ్రీనివాసరావు, సక్రు, మహవీర్‌జైన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెట్రోలింగ్ హట్స్ ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ రూరల్: పెట్రోలింగ్ హట్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ మహబూబాబాద్ రైల్వే స్టేషన్ తనిఖీకి వచ్చిన డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైక్‌కు మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. మొదటి సారిగా డీఆర్‌ఎం విచ్చేసిన సందర్భంగా పూలమాల శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ యుగంధర్ యాదవ్ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డోర్నకల్ సెక్రటరీ సెక్రటరీ అంజయ్య, మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ సెక్రెటరీ మోహన్ కుమార్, వైస్ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఎం వినతి పత్రం ఇస్తున్న యుగంధర్ యాదవ్, తదితరులు

సమరయోధుల ఆశయ సాధనకు కృషి

తొర్రూర/ పెద్దవంగర: స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య అన్నారు. ఆజాదీ కా అమృత్ ఉత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో, పెద్దవంగరలోని చిట్యాల గ్రామంలో 'మేరా మిట్టి -మేరా దేశ్'కార్యక్రమాన్ని చేపట్టారు. పాటిమీది హనుమాన్ ఆలయ సమీపంలో మట్టి సేకరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా కార్యదర్శి పరుపాటి రామ్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్, నాయకులు రవిబాబు, యాకయ్య, సోమయ్య , తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు: మట్టిని సేకరించిన బీజేపీ నాయకులు

విజయవంతం చేయండి

కేసముద్రం: కార్మికుల సమస్యలపై ఈనెల 5న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఆఫీస్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలో చలో హైదరాబాద్ కరపత్రాలను సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కట్టయ్య, శ్రీనివాస్, రవి, వెంకన్న, మల్లేశం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శంకర్ డిమాండ్ చేశారు. సంఘ సమావేశం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో రవీంద్రనాయక్, గులగట్టు శ్రీనివాస్, బొమ్మెర సురేష్, సంద అనిల్, ఎండి. అలీ పాల్గొన్నారు.

గ్రామదేవతల ఒడిలో ప్రజలు సుభిక్షం

దంతాలపల్లి: గ్రామదేవతల ఒడిలో ప్రజలు సుభిక్షంగా ఉంటారని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలో గల చిన్న చెరువు శ్రీరామలింగేశ్వరస్వామి గుడి ఆవరణలో శుక్రవారం దంతాలపల్లి ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి నూతన గుడి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, యువ నాయకుడు రవిచంద్ర, మండల అధ్యక్షులు ధర్మారపు వేణు, సహకార సంఘం చైర్మన్ రాము, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ మెంబర్ కిశోర్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మండల అభివృద్ధికి నిధులు మంజూరు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

దంతాలపల్లి: మండల కేంద్రం అభివృద్ధికి రూ.95లక్షల నిధులు ఎమ్మెల్యే రెడ్యానాయక్ మంజూరు చేసినట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.60లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో తారు రోడ్డు నిర్మాణం, రూ.20లక్షల సీడీఎఫ్ నిధులతో, రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో, ఎమ్మెల్సీ తక్కెల్లపల్లి రవీందర్ మంజూరు చేసిన రూ.5లక్షల నిధులతో గ్రామంలో అంతర్గత సీసీ రొడ్డు నిర్మాణంతో పాటు ఆస్పత్రి వీధికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అద్యక్షులు ధర్మారపు వేణు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్యాల నరేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

పెద్దవంగర: ఆధ్యాతిక చింతన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని జెడ్పీటీసీ జ్యోతిర్మయి సుధీర్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు వీధుల్లో తిరుగుతూ పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో సీతామాచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని కోరుతూ సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నేటినుంచి 4 తేదిన సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, దయాకర్ హాజరవుతారని, దేవాలయం ప్రారంభోత్సవాన్ని చిన్న జీయర్‌స్వామి చేపడతారని తెలిపారు. కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మీ, శ్రీరాం సంజయ్, లింగమూర్తి, భిక్షపతి, అనుదీప్, యాకయ్య, సమ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

'దళితబంధు' అధికార పార్టీ పథకమా?



మాట్లాడుతున్న దళితులు

డోర్నకల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం ప్రవేశపెట్టారంటూ పెరుమాళ్లసంకీస గ్రామానికి చెందిన దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం పలు పలు దళిత కుటుంబాలకు చెందిన నాగేశ్వర్‌రావు, ఉదయ్‌కుమార్, ఎల్లమ్మ తదితరులు మాట్లాడుతూ.. దళితబంధు కోసం 140 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. గ్రామానికి 15 యూనిట్లు మంజూరయ్యాయంటూ అధికార పార్టీ నాయకుడు శుక్రవారం ఇంటికి పిలిచాడని తెలిపారు. అధికార పార్టీలో ఉన్న వారికి, పార్టీలో చేరేవారికి మాత్రమే దళితబంధు పథకం మంజూరు చేస్తామన్నాడు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద దళితులకు దళతబందు పథకం వర్తింపజేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రేషన్ బియ్యం పట్టివేత

కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ పారిపోయాడు. ఆటోతో సహాబియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపాడు.

కేసముద్రం: ఆటోలో 5 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని, మానుకోట వైపునకు తరలిస్తుండగా సమాచారం మేరకు బేరువాడ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు ఆటోను పట్టుకున్నామని ఎస్సై తిరుపతి తెలిపాడు. కేసు నమోదు చేసుకుని ఆటోను సీజ్ చేసినట్లు పేర్కొన్నాడు.

విద్యార్థులకు అవగాహన

మహబూబాబాద్ అర్బన్: నేడు ఇస్రో శాస్త్రవేత్తలు సూర్యుని వద్దకు ప్రయోగించబోతున్న ఆదిత్య ఎల్-1 విజయవంతం కావాలని వర్సటైల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండి .ఖాలీద్ పాషా, విద్యార్థులు ఆల్ ద బెస్ట్ తెలిపారు. శుక్రవారం విజయవంతం కావాలని అవగాహన నిర్వహించారు.

భూమిపూజ

గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి శంకుస్థాపన కోసం ఏర్పాటు చేసే శిలాఫలకం స్థూపం నిర్మాణానికి ఎంపీపీ శివాజీచౌహాన్ శుక్రవారం భూమిపూజ చేశారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌ల చేతుల మీదుగా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

బీఎల్‌ఓలకు కిట్ల పంపిణీ

కొత్తగూడ: బీఎల్‌ఓలకు ప్రభుత్వం నుంచి వచ్చిన కిట్లను తహసీల్దార్ రమాదేవి శుక్రవారం పంపిణీ చేశారు. కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటరు లిస్టులో తప్పులు సరి చేయడం, ఒక చోటి నుంచి మరో చోటికి ఓటరు కార్డు మార్పిడి చేయడం, ఇతర అంశాలపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఆయా బూత్‌ల పరిధిలో బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌ఐ గిరిబాబు, ఎంపీఎస్‌ఓ రమేష్ పాల్గొన్నారు.

మిల్లర్ వర్కర్స్ గ్రామ కమిటీ ఎన్నిక



నెల్లికుదురు: మండలంలోని చిన్ననాగారం గ్రామంలో మిల్లర్స్ వర్కర్స్ గ్రామ కమిటీని శుక్రవారం వర్కర్లందరు కలిసి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరిపెల్లి లింగన్న, ఉపాధ్యక్షుడిగా చెడుపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పింగిలి రాజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

డోర్నకల్: మిరపనారుకు తెగుళ్లు సోకకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ అధికారి అనితశ్రీ కోరారు. మండలంలోని రావిగూడెం, పెరుమాళ్లసంకీస, బొడ్రాయితండా గ్రామాల్లో శుక్రవారం అనితశ్రీ పర్యటించి మిరపతోటలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు జాగ్రత్తలు పాటించాలని అనితశ్రీ సూచించారు.

ఎమ్మెల్యేతోనే అభివృద్ధి

మరిపెడ రూరల్: ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తోనే అభివృద్ధి సాధ్యమని లక్ష్మాతండా సర్పంచ్ బానోతు సుజాతమంగిలాల్ నాయక్ అన్నారు. మరిపెడ మండలం లక్ష్మాతండా గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ శుక్రవారం ప్రారంభించారు.

దరఖాస్తుల తేదీ పొడిగింపు

గూడూరు: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే, బీసీ సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తుల చివరి తేదీని సెప్టెంబర్ 11 వ తేదీ వరకు పొడిగించినట్లు గురుకుల ప్రిన్సిపాల్ శ్వేత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన బాలికలు దరఖాస్తులను నేరుగా తమ పాఠశాలలో అందజేయాలన్నారు.


కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక





పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, తోటకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మెరబోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా చాట్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా బొమ్మెరబోయిన ప్రభాకర్, కోశాధికారిగా మహంకాళి నవీన్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా బొమ్మెరబోయిన రేణు, బీసీ సెల్ అధ్యక్షుడిగా కొండ అనిల్, ఎస్సీసెల్ సుధాకర్, యూత్ అధ్యక్షుడిగా మధు, మైనార్టీ సెల్ ఎండీ యాకుబ్ నియమితులైయ్యారు.

కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా షరీఫ్



తొర్రూరు: కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన ఎండీ షరీఫ్ నియమితులయ్యాడు. శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి నియామక పత్రాన్ని అందించారు.

అప్పు ఇప్పించాలని ట్యాంక్ ఎక్కిన యువకుడు



మరిపెడ: మరిపెడ శివారు నామ్లతండాకు చెందిన బానోతు దామ అనే వ్యక్తి మండల కేంద్రంలోని మూడు నరేందర్ అనే వ్యక్తికి రూ.50వేలు అప్పు ఇవ్వగా అందులో రూ.10వేలు ఇచ్చి మిగిలినవి ఇవ్వకుండా తిప్పుతున్నాడని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని వాటర్‌ట్యాంక్ ఎక్కాడు. అనంతరం స్థానికులు నచ్చజెప్పి కిందికి తీసుకవచ్చారు.

బాల్యమిత్రుడికి ఆర్థికసాయం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన బెత్తం శ్రీనివాస్ కొంతకాలంగా కాలేయ సమస్యతో బాధపడుతున్నాడు. శుక్రవారం అతని మిత్రులు 1997-96 బ్యాచ్ విద్యార్థులు రూ.26వేల ఆర్థికసాయన్ని అందజేశారు.

జర్నలిస్టుకు..

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు కొప్పుల శ్రీనివాస్ విధి నిర్వహణలో ఇటీవల గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. శుక్రవారం శ్రీనివాస్ కుటుంబానికి సీపీఐ పార్టీ తరపున రూ.11వేల ఆర్థిక సాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి రాజన్న, నాయకులు సమ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పెద్దవంగర: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామచంద్రు తండాకు చెందిన జాటోతు అరుణ్ (25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటు ఉంటున్నాడు. అనారోగ్యంతో ఇటీవల తన తండాకు వచ్చిన అతను రోగం నయంకాక పోవడంతో పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తండ్రి బోజ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటినుంచి ఎమ్మెల్యే పర్యటన

చిన్నగూడూరు: డోర్నకల్ నియోజకవర్గంలోని చిన్నగూడూరు మండలంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఎమ్మెల్యే రెడ్యానాయక్ పర్యటించనున్నట్లు శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, మురళీధర్ రెడ్డి తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.